


# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా







సంపుటి - 07 | సంచిక 252 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం, 13, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# దేశంలో పోరాటాలు ఉద్ధృతం !

## దేశ రక్షణకు ఉద్యమాలే మార్గం



- కేంద్రంపై తిరగబడుతున్న దేశ యువత
- పాలనను సమీక్ష చేస్తామంటున్న హోం శాఖా మంత్రి అమిత్ షా
- హక్కుల రక్షణ కోసం ఎక్కడ తగ్గని ఉద్యమకారులు
- ప్రాణాలు త్యాగం చేసుకుని పోరాడుతున్న యువత
- విచ్చలవిడి కేసులతో యువత జీవితాలను నాశనం చేస్తున్న కేంద్రం
- పోరాటాల ఉనికితో ఒక్కసారిగా వెనక్కి తగ్గిన కేంద్రం
- దేశ సామరస్యతను పెంపొందించడమే ఉద్యమ లక్ష్యం
- నిజాయితీగా పోరాడే వాళ్ళ ప్రాణాలకు రక్షణ లేదు
- అక్రమ ఆస్థి దారులందరూ దేశద్రోహులే
- డాక్టర్ బరిగెల శివ

దేశంలో ప్రజా సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం యువత ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతమవుతున్నాయని డాక్టర్ బరిగెల శివ అన్నారు. దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరిగే పోరాటాలు రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తున్న పరిస్థితుల్లో యువత హక్కుల కోసం వెనక్కి తగ్గకుండా పోరాడుతోందన్నారు. విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాలు దేశవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చాయని తెలిపారు. జంతర్‌మంతర్ వంటి ఉద్యమాలు ప్రభుత్వ విధానాలపై తీవ్ర ప్రభావం చూపించాయని ఆయన అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా, యూట్యూబ్, కేబుల్ మీడియా ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచి దేశవ్యాప్తంగా వాటి ప్రభావాన్ని పెంచాయని చెప్పారు. ప్రజాస్వామ్య హక్కులు, ఎన్నికల వ్యవస్థ, న్యాయవ్యవస్థ స్వేచ్ఛను కాపాడేందుకు సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా న్యాయవ్యవస్థ స్వతంత్రంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యతలో యువత కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ప్రజల హక్కుల పరిరక్షణ, దేశ సామరస్యత, భవిష్యత్తు కోసం శాంతియుత ప్రజా ఉద్యమాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)



2






డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## ఖాకీపై ఆరోపణల మచ్చలు !

- ఐపీఎస్ అధికారి చుట్టూ అవినీతి ఆరోపణల ప్రకంపనలు.
- ఇన్‌స్పెక్షన్ నుంచి బదిలీల దాకా 'వసూళ్ల' ఆరోపణలు..
- డీజీ ఆఫీస్‌కు అటాచ్‌మెంట్‌తో పోలీస్ వర్గాల్లో హాట్‌టాపిక్
- అటాచ్మెంట్తో సరిపెడతారా ఆస్తులపై విచారిస్తారా.
- అవినీతి అధికారులపై కఠినంగా వ్యవహరించాల్సిందే.
- రాష్ట్ర పోలీస్ శాఖకు కేంద్ర స్థాయి గుర్తింపు ఉంది.
- ఇలాంటి అధికారులతో పోలీస్ శాఖకు తలవంపులు తప్పవు.
- రాష్ట్ర డిజిపి రంగంలోనికి దిగి హెచ్చరించడం అద్భుతం.
- సీనియర్ ఐపీఎస్ అధికారులు పోలీస్ శాఖకు తలవంపులు తేకండి
- ఆస్తుల సంపాదనే ముఖ్యమా ప్రజా రక్షణే ప్రాముఖ్యమా మీరే తెలుసుకోండి : డాక్టర్ బరిగెల శివ
- జై భీమ్ దినపత్రిక - ప్రత్యేక కథనం



3

## జిల్లా వ్యాప్తంగా మొరం దందా!




- అధికారులు, పాలకుల తీరుకు అగ్నిపరీక్ష...
- అనుమతులు ఉన్నాయా? అక్రమ తవ్వకాలా?
- యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు.. టిప్పర్లతో భారీగా రవాణా
- మైనింగ్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు
- ప్రభుత్వాలు మారిన మొరం దందా మారడం లేదు
- అధికారులు, నాయకులు, ఇతరులు కలిసి మొరం వ్యాపారం చేస్తున్నారు
- నగరం మొత్తం నాణ్యమైన మొరం దందా నడుస్తుంది
- ప్రజలు గగ్గోలు పెట్టి మొత్తుకున్న పట్టించుకోవడం లేదు
- ఎక్కడి మొరం దందాను అక్కడనే వాహనాలను సీజ్ చేస్తూ క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- క్వారీల వెనుక రాజకీయ అండదండలున్నాయంటూ ఆరోపణలు
- "మొరం మాఫియా"కు అడ్డూ అదుపూ లేదా?

2

## గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలో అసలేం జరుగుతోంది?

- 40 వేల వ్యవహారంపై ఫిర్యాదు.. ఫేక్ రసీదు ఆరోపణలు..
- కమిటీ విచారణ ఏమైంది?
- చర్యలు తీసుకున్నారా? లేక బదిలీతోనే వ్యవహారాన్ని ముగించారా?
- ఉద్యోగిని కాపాడుతున్న 'అదృశ్య హస్తం' ఎవరిది?
- కాశిబుగ్గ సర్కిల్‌లో కొందరు అధికారుల తీరుపై ఉద్యోగుల్లో గుసగుసలు

5




## కోట్ల ఆస్తులున్న వ్యక్తిని పెళ్లాడింది.. కండక్టర్‌తో వెళ్లిపోయిందా?

- అఖిల్-మేఘా వ్యవహారంపై సోషల్ మీడియాలో చర్చ
- భార్యపై అఖిల్ సంచలన ఆరోపణలు
- క్యాష్, బంగారం తీసుకెళ్లిందని ఆరోపణ
- మేఘా నుంచి అధికారిక స్పందన కరువు
- అసలు వాస్తవాలు తేలాల్సి ఉందంటున్న నెటిజన్లు

2



కేరళకు చెందిన సోషల్ మీడియా జంట అఖిల్-మేఘా వ్యవహారం ప్రస్తుతం నెట్టింట తీవ్ర చర్చకు దారితీసింది. సోషల్ మీడియాలో క్యూట్ వీడియోలు, ఫ్యామిలీ వ్లాగ్స్, ట్రావెల్ రీల్స్‌తో అభిమానులను సంపాదించుకున్న ఈ జంట జీవితంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తన భార్య మేఘా ఇంటి నుంచి వెళ్లిపోయిందంటూ అఖిల్ ఓ వీడియోలో సంచలన ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఆమె ఓ లోకల్ బస్సు కండక్టర్‌తో కలిసి వెళ్లిపోయిందని అఖిల్ ఆరోపించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇంట్లోని నగదు, బంగారం, విలువైన వస్తువులను కూడా ఆమె తీసుకెళ్లిందని ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో తాను తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని అఖిల్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే అఖిల్ చేసిన ఆరోపణలపై మేఘా నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు. దీంతో మేఘా ఎందుకు వెళ్లింది, కండక్టర్‌తో కలిసి వెళ్లిందా, నగదు-బంగారం తీసుకెళ్లిందా అనే ప్రశ్నలు నెటిజన్లలో వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం అఖిల్ ఆరోపణల ఆధారంగానే ఉండటంతో వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. మేఘా స్పందనతో పాటు అధికారిక వివరాలు వెలుగులోకి వచ్చిన తర్వాతే ఈ వ్యవహారంలో అసలు నిజానిజాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. - హైదరాబాద్, జై భీమ్ న్యూస్

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# అశోక్‌నగర్‌లో అరుదైన బాండెడ్ క్రేట్ పాము కలకలం

ఖానాపురం మండలం అశోక్‌నగర్ శివారులో 5 అడుగుల విషపూరిత సర్పం



**ఖానాపురం, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామ శివారులో అరుదైన బాండెడ్ క్రేట్ పాము ప్రత్యక్షమై స్థానికులను భయాందోళనకు గురిచేసింది. నలుపు, పసుపు రంగు చారలతో సుమారు ఐదు అడుగుల పొడవున్న ఈ విషపూరిత సర్పాన్ని గుర్తించిన స్థానికులు అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అటవీ సిబ్బంది, స్నేక్ క్యాచర్ చాకచక్యంగా పామును పట్టుకున్నారు. అనంతరం దానిని సమీప అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు. బాండెడ్ క్రేట్ సాధారణంగా రాత్రివేళల్లో సంచరిస్తుందని అటవీ అధికారులు తెలిపారు. భారతదేశంలోని జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఈ పాము అరుదుగా కనిపిస్తుందని పేర్కొన్నారు. చైనా, నేపాల్, థాయిలాండ్, కాంబోడియా, వియత్నాం దేశాల్లోనూ ఈ జాతి సర్పాలు కనిపిస్తాయని తెలిపారు. లారీల్లో అనుకోకుండా ఎక్కి ఉండటం లేదా దారితప్పి రావడం వల్లే ఈ పాము అశోక్‌నగర్ ప్రాంతానికి చేరుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. బాండెడ్ క్రేట్ అత్యంత విషపూరితమైన పాము కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాము కనిపించినప్పుడు దానిని పట్టుకునే ప్రయత్నం చేయకుండా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# శ్రీ చక్ర ఆసుపత్రిలో బాలుడి మృతి.. బంధువుల ఆందోళన






**హన్మకొండ, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని శ్రీ చక్ర సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎటు నాగారం--శంకర్‌పల్లి గ్రామానికి చెందిన బాలుడు అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న క్రమంలో బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందాడని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. చికిత్స పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదానికి గురయ్యారు. అనంతరం ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగుతూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాలుడి మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాలుడి మృతిపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణల నేపథ్యంలో ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, వైద్య కారణాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# పాత్‌ఫైండర్ హై స్కూల్లో ఘనంగా కేబినెట్ ప్రతిష్ఠాపన కార్యక్రమం

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**



ఐనవోలు గ్రామంలోని పాత్‌ఫైండర్ హై స్కూల్ లో విద్యార్థి నాయకత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో కేబినెట్ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ డా. ఎన్. వెంకటేశ్వరరావు హాజరై విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు ధరింపజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించి క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలోని హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్లు మరియు ఇతర విద్యార్థి ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేసి తమ బాధ్యతలను స్వీకరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ సుభానుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ డా. ఎల్ . ఎన్. వెంకటేశ్వరరావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేశంలో పోరాటాలు ఉధృతం






**దేశ రక్షణకు ఉద్యమాలే మార్గం**
**కేంద్రంపై తిరగబడుతున్న దేశ యువత**
**పాలనను సమీక్ష చేస్తామంటున్న హోం శాఖా మంత్రి అమిత్ షా**
**హక్కుల రక్షణ కోసం ఎక్కడ తగ్గని ఉద్యమకారులు**
**ప్రాణాలు త్యాగం చేసుకుని పోరాడుతున్న యువత**
**విచ్చలవిడి కేసులతో యువత జీవితాలను నాశనం చేస్తున్న కేంద్రం**
**పోరాటాల ఉనికితో ఒక్కసారిగా వెనక్కి తగ్గిన కేంద్రం**
**దేశ సామరస్యతను పెంపొందించడమే ఉద్యమ లక్ష్యం**
**నిజాయితీగా పోరాడే వాళ్ళ ప్రాణాలకు రక్షణ లేదు**
**అక్రమ ఆస్థి దారులందరూ దేశద్రోహులే**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

దేశ యువత చేస్తున్న ఉద్యమ తీవ్రత దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తుందని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయం వ్యక్తం చేశారు.దేశ రాజకీయాలను కనీస స్థాయిలో ప్రభావితం చేయలేని స్థితిలో ప్రతిపక్షాలు ఉంటుండగా ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో అణిచివేస్తున్న సందర్భంలో దేశ రక్షణ కోసం దేశ భవిష్యత్తు కోసం పోరాటాలు చేస్తున్న ఏఐసీసీ ప్రధాన నేత రాహుల్ గాంధీకి కర్ణాటక ప్రభుత్వంతోపాటు తెలంగాణ ప్రభుత్వం,తమిళనాడు,కేరళ,ఇంకొన్ని ఇతర రాష్ట్రాలు పూర్తిస్థాయిలో మద్దతునిస్తూ సహకరిస్తున్నాయని దేశ భవిష్యత్తును కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.12 సంవత్సరాల చరిత్రలో కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అత్యంత బలమైన శక్తిగా మార్పు చెంది ప్రతిపక్షాలను కేంద్ర ప్రభుత్వ దరిదాపుల్లోనికి రాకుండా అడ్డుపడుతూనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమ కార్యక్రమాల పట్ల ఉక్కు పాదాన్ని మోపుతూ అవసరమైతే ఉన్నపాటుగా ప్రభుత్వాలను ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూలదోల్చే ప్రయత్నాలు చేస్తూ ఆయా రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించాల్సిన నిధులను నిలుపుదల చేస్తూ మానసికంగా ఇబ్బందుల పాలు చేయడం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పాలనలను ఇబ్బందులకు గురి చేయడమేనని పేర్కొన్నారు.

**యువతే దేశ రక్షణ ఊపిరి..**

12 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం భారతదేశాన్ని తిరుగులేకుండా పరిపాలిస్తున్నామని గట్టి విశ్వాసంతో ఉంటుండగా అన్ని రాష్ట్రాల ప్రజలు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఎన్నికల కమిషన్ సహాయ, సహకారాలతో ప్రతి రాష్ట్రంలోని ఎన్నికలను గెలుచుకుంటుందని తీవ్రస్థాయిలో విమర్శిస్తుండగా కేంద్ర ప్రభుత్వం గెలుస్తున్న ప్రతి రాష్ట్రంలో సాంకేతిక ఎన్నికల ప్రభావం ఉన్నత స్థాయిలో కనిపిస్తుందని దేశ ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు.గెలుపొందుతున్న ప్రతి రాష్ట్రంలో సాంకేతిక పరికరాలను ధ్వంసం చేయడం, కాలబెట్టడం లాంటివి తరచుగా జరుగుతుండగా దేశ ప్రజలకు ఉన్నటువంటి అనుమానాలు బలమైన స్థాయికి చేరిపోయేలా చేస్తున్నాయన్నారు. అలాంటి సందర్భాల్లోనే కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అణచివేత ధోరణిలపై దేశ యువత ఒక్కసారిగా తిరగబడ్డారని అందులో భాగంగానే ఉద్యమ స్ఫూర్తిని దేశానికి చాటడం కోసం నీట్ పరీక్ష పత్రం లీక్ అవ్వడాన్ని ప్రధాన అంశపు ఎజెండాగా తీసుకున్నారని దాని ఉద్యమ తీవ్రత భారత దేశ ప్రజలనే కాకుండా ప్రపంచ దేశాలను ఒక్కసారిగా కదిలించగలిగిందని గర్వపడ్డారు.ఉవ్వెత్తున ఎగిసి పడిన జంతర్ మంతర్ ఉద్యమం యువత దేశ రక్షణ కోసం చేసిన పోరాటంలో దారుణమైన దాడులను, లాటీచార్జీలను,భరించి ఉద్యమాన్ని కనపరిచిన తీరు దేశ ప్రజలనే కాకుండా కేంద్ర ప్రభుత్వాన్ని కూడా వెనక్కి తగ్గేలా చేసిందని అభినందించక తప్పదన్నారు.దేశంలో పెరిగిపోతున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల,ఆర్థిక నిలువు దోపిడీ పట్ల ఉద్యమాలు జరగాల్సి ఉంటుండగా దేశానికి దేశ యువతకు దేశంలోని మేధావులకు విద్యార్థులకు అత్యంత ప్రామాణికమైన విద్యను అందించడం కోసం విద్యా వ్యవస్థను కాపాడుకునే క్రమంలో యువత చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు.జంతర్ మంతర్ ఉద్యమంతో శక్తివంతమైన నాయకుడు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం కేంద్ర ప్రభుత్వం యువత చేస్తున్న ఉద్యమాలపై అన్ని రకాల బల ప్రయోగాలను ప్రయోగించిన తర్వాత మాత్రమే జరిగిందన్న సంగతిని దేశ ప్రజలు నిర్ధారణకు వచ్చారని తెలిపారు.దేశంలో బలంగా స్థిరపడిన పారిశ్రామికవేత్తలు ఒకరిద్దరూ 100కు పైన మీడియా సంస్థలను నడుపుతూ దేశ ప్రజలను అమాయక ఊబిలోనికి నెట్టేస్తూ కేంద్ర ప్రభుత్వ విధానపరమైన పరిపాలనలో జరుగుతున్న అసౌకర్యమైన పాలనలతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను ఎక్కడా చూపించకుండా అడ్డుపడడంతో దేశంలో ఒక్కసారిగా సోషల్ మీడియా వెలుగులోనికి వచ్చిందని ప్రపంచ దేశాలను కదిలించే స్థాయికి జంతర్మంతర్ ఉద్యమాన్ని జంతర్మంతర్ ఉద్యమ ఉనికిని ప్రభావితం చేయగలిగింది మాత్రం ముమ్మాటికి సోషల్ మీడియేనని చెప్పక తప్పదన్నారు.అదే సందర్భంలో దేశవ్యాప్తంగా యూట్యూబ్ ఛానల్స్,కేబుల్ మీడియా ఛానల్స్,ఎక్కడ తగ్గకుండా దేశ ఉనికి కోసం యువత చేస్తున్న పోరాటాలకు సహకారంగా నిలబడినయాని పూర్తిస్థాయిలో అభినందించారు.ఉద్యమ మార్గాలను ఎంచుకోవడంలో యువత పరిపూర్ణంగా సఫలీకృతులైనారని దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రంలోనైనా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబబించాలంటేనే భయపడే స్థాయికి ఉద్యమ తీవ్రత పార్లమెంటు ఉభయ సభలను ప్రభావితం చేస్తుందని ఏకంగా దేశ ప్రధానమంత్రి హోం శాఖ మంత్రి ఇతర ముఖ్యమైన మంత్రులు వర్షాకాలకు పార్లమెంట్ సమావేశాలకు హాజరుకాలేనంత శక్తివంతమైన పోరాటాలను దేశ యువత కనపరచడం పట్ల దేశ ప్రజలు గర్వపడుతున్నారని తెలిపారు.దేశాన్ని రక్షించుకోవడం కోసం యువతే దేశ రక్షణకు ఊపిరిగా నిలుస్తున్నారని నేటి ఉద్యమాలు ఆ తరహా ప్రభావాలను దేశంలో కనపరచబోతున్నాయంటూ ఆశాభవాన్ని వ్యక్తం చేస్తూనే దేశాన్ని రక్షించుకోవడం కోసం దేశ భవిష్యత్తుకు పునాదుల్లా నిలబడడం కోసం దేశ యువత సంసిద్ధంగా ఉన్నారన్న సంగతిని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు.దేశంలో రెండు ప్రధానమైన మార్పులు జరగాల్సి ఉందని అందులో ఒకటి దేశ ఎన్నికల విధానం పూర్తిస్థాయితో మార్పు చెందితేనే తప్ప దేశంలో జరుగుతున్న ఎన్నికల సరళి సరియైన విధానంలో జరిగే ఆస్కారం ఉండదేమోనన్నారు.రెండవదిగా కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానాలపై ఒత్తిడి తగ్గించాలని న్యాయాన్ని ధర్మాన్ని దేశాన్ని రక్షించే బాధ్యతను పూర్తిస్థాయిలో అమలుపరచడానికి కృతనిశ్చులైవుంటున్న న్యాయమూర్తులపై రాజకీయ ఒత్తిళ్లు రాజకీయ ప్రభావం ఎక్కువ స్థాయిలో పెరిగిపోతుందని వాటి నియంత్రించడం కోసం అలాంటి ప్రధానమైన వ్యవస్థలలో సంపూర్ణమైన నిజాయితీ స్వేచ్ఛ దేశ రక్షణ పట్ల హక్కులు కల్పించబడేవిధంగా విధాన పరమైన నిర్ణయాలు అమలుపరచబడాలని కోరుతున్నానన్నారు.



# కోట్ల ఆస్తులున్న వ్యక్తిని పెళ్లాడింది.. కండక్టర్‌తో వెళ్లిపోయిందా?

**అఖిల్-మేఘా వ్యవహారంపై సోషల్ మీడియాలో చర్చ**
**భార్యపై అఖిల్ సంచలన ఆరోపణలు**
**క్యాష్, బంగారం తీసుకెళ్లిందని ఆరోపణ**
**మేఘా నుంచి అధికారిక స్పందన కరువు**
**అసలు వాస్తవాలు తేలాల్సి ఉందంటున్న నెటిజన్లు**





**హైదరాబాద్, ఆగస్టు 13 (జై భీమ్ న్యూస్):**

కేరళకు చెందిన ప్రముఖ సోషల్ మీడియా జంట అఖిల్--మేఘా వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది మంది ఫాలోవర్లు, క్యూట్ వీడియోలు, ఫ్యామిలీ వ్లాగ్స్, ట్రావెల్ రీల్స్‌తో అభిమానులను సంపాదించుకున్న ఈ జంట జీవితంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అఖిల్ విడుదల చేసిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన భార్య మేఘా ఓ లోకల్ బస్సు కండక్టర్‌తో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిందని అఖిల్ ఆరోపించాడు. అంతేకాకుండా ఇంట్లో ఉన్న నగదు, బంగారం, విలువైన వస్తువులను కూడా ఆమె తీసుకెళ్లిందని ఆరోపించినట్లు సమాచారం. తన కుటుంబంలో చోటుచేసుకున్న పరిణామంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని అఖిల్ వీడియోలో పేర్కొన్నాడు. ఒకప్పుడు సోషల్ మీడియాలో 'హ్యాపీ కపుల్'గా కనిపించిన వీరి జీవితంలో ఇలాంటి పరిణామం ఎలా చోటుచేసుకుందనే అంశంపై నెటిజన్లు చర్చించుకుంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై మేఘా నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు. అఖిల్ చేసిన ఆరోపణలే ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మేఘా ఎందుకు వెళ్లింది? నిజంగానే కండక్టర్‌తో కలిసి వెళ్లిందా? నగదు, బంగారం తీసుకెళ్లిందా? అనే ప్రశ్నలకు ఇంకా స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి నవ్వు వెనుక నిజమైన ఆనందమే ఉంటుందని చెప్పలేమనే చర్చ మరోసారి మొదలైంది. బయట ప్రపంచానికి ఆదర్శ జంటగా కనిపించిన వారి వ్యక్తిగత జీవితంలోనూ ఊహించని సమస్యలు ఉండవచ్చని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం అఖిల్ ఆరోపణల ఆధారంగానే వైరల్ అవుతున్న నేపథ్యంలో, మేఘా స్పందనతో పాటు అధికారిక వివరాలు వెలుగులోకి వచ్చిన తర్వాతే పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# ఖాకీపై ఆరోపణల మచ్చలు !





**ఐపీఎస్ అధికారి చుట్టూ అవినీతి ఆరోపణల ప్రకంపనలు.**
**ఇన్‌స్పెక్షన్ నుంచి బదిలీల దాకా 'వసూళ్ల' ఆరోపణలు..**
**డీజీ ఆఫీస్‌కు అటాచ్‌మెంట్‌తో పోలీస్ వర్గాల్లో హాట్‌టాపిక్**
**అటాచ్మెంట్తో సరిపెడతారా ఆస్తులపై విచారిస్తారా.**
**అవినీతి అధికారులపై కఠినంగా వ్యవహరించాల్సిందే.**
**రాష్ట్ర పోలీస్ శాఖకు కేంద్ర స్థాయి గుర్తింపు ఉంది.**
**ఇలాంటి అధికారులతో పోలీస్ శాఖకు తలవంపులు తప్పవు.**
**రాష్ట్ర డిజిపి రంగంలోనికి దిగి హెచ్చరించడం అద్భుతం.**
**సీనియర్ ఐపీఎస్ అధికారులు పోలీస్ శాఖకు తలవంపులు తేకండి.**
**ఆస్తుల సంపాదనే ముఖ్యమా ప్రజా రక్షణే ప్రాముఖ్యమా మీరే తెలుసుకోండి.**
**డాక్టర్ బరిగెల శివ.**
**జై భీమ్ దినపత్రిక - ప్రత్యేక కథనం**

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

రాష్ట్ర పోలీస్ శాఖను బలోపేతం చేయాలని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయపడ్డారు. కొంతమంది ఐపీఎస్ అధికారులు చేతివటానికి మరిగి రాష్ట్ర పోలీస్ శాఖను అబాసుపాలు చేయాలని చూస్తుండడంతో స్వయంగా రంగంలోకి దిగిన రాష్ట్ర డిజిపి పత్రిక సమావేశం ఏర్పాటు చేయడమే కాకుండా రాష్ట్ర ప్రజలకు పోలీస్ శాఖపై ఉన్న నమ్మకాన్ని విశ్వాసాన్ని పోగొట్టకూడదనే సంకల్పంతో రాష్ట్ర డిజిపి సీవి ఆనంద్ ఐపీఎస్ ఆ నలుగురు ఐపీఎస్ అధికారులపై విరుచుకుపడుతూ పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవంటూ హెచ్చరించడం రాష్ట్ర పోలీస్ శాఖలో తీవ్రమైన చర్చ నడుస్తుందని పేర్కొన్నారు.అందులో ఒకరైన డీఐజీపై వస్తున్న ఆరోపణలను పూర్తిస్థాయిలో వివరిస్తూ డిజిపి కార్యాలయానికి అటాచ్మెంట్ చేయడం పట్ల కొంతవరకు పోలీస్ శాఖ పేరును కాపాడుతున్న వాళ్లు అవుతున్నప్పటికీ అవినీతి ఆస్తులపై విచారణ జరిపిస్తే తప్ప ఇతర పోలీస్ అధికారులకు భయం ఉండదని తెలిపారు. అట్టి సీనియర్ ఐపీఎస్ అధికారిపై వివరిస్తూ... ఖాకీ అంటే క్రమశిక్షణకు ప్రతీక. ఐపీఎస్ అంటే బాధ్యతకు చిరునామా. కానీ ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి వ్యవహారశైలిపై వినిపిస్తున్న ఆరోపణలు ఇప్పుడు పోలీస్ శాఖలోనే చర్చనీయాంశంగా మారాయి. అధికారి పేరు చుట్టూ అవినీతి ఆరోపణలు, బదిలీల్లో చేతివాటం, నెలవారీ మామూళ్ల వసూళ్లు, ఇన్‌స్పెక్షన్ల పేరుతో భారీ ఖర్చులు, కింది స్థాయి సిబ్బందితో దురుసు ప్రవర్తన వంటి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోగులాంబ రేంజ్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్‌ను డీజీ కార్యాలయానికి అటాచ్ చేయడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యత తెచ్చింది. ఈ పరిణామంపై పోలీస్ వర్గాల్లో రకరకాల చర్చలు జరుగుతున్నాయి.

### ఇన్‌స్పెక్షన్ అంటే.. 'ఇంత' ఖర్చా?.

పోలీస్ స్టేషన్‌కు ఉన్నతాధికారి ఇన్‌స్పెక్షన్‌కు వస్తే ఫైళ్లు, రికార్డులు, కేసుల పురోగతి పరిశీలించాలి. కానీ సదరు అధికారి ఇన్‌స్పెక్షన్‌కు వస్తే రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వచ్చేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భోజన ఏర్పాట్లలో సైతం ప్రత్యేక డిమాండ్లు ఉండేవని, ఆరు రకాల మాంసాహార వంటకాలు తప్పనిసరిగా ఉండాల్సి వచ్చేదనే ఆరోపణలు పోలీస్ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి.

### ఫైళ్ల కంటే భోజన బిల్లులే ఎక్కువా?

ఇన్‌స్పెక్షన్ పేరుతో స్టేషన్లపై అదనపు ఆర్థిక భారం ఎందుకు? అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. బదిలీ కావాలంటే 'మార్గం' ఉందా?. పోలీస్ శాఖలో బదిలీ అనేది పరిపాలనా ప్రక్రియ. కానీ సదరు అధికారి పరిధిలో బదిలీల విషయంలో డబ్బు చేతులు మారితే కోరుకున్న చోట పోస్టింగ్ వస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు, ఎస్ఐల బదిలీల్లో మధ్యవర్తులు కీలకంగా వ్యవహరించేవారనే ప్రచారం ఉంది. దశాబ్దాలుగా ఒక ప్రాంతంలో పనిచేసిన ఉద్యోగిని దూర ప్రాంతానికి పంపించి.. తిరిగి అదే ప్రాంతానికి రావాలంటే మరో 'మార్గం' వెతుక్కోవాల్సి వచ్చేదనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి.

### ప్రతి సర్కిల్‌కు నెలవారీ 'టార్గెట్'?

ఇది మరింత తీవ్రమైన ఆరోపణ. సదరు అధికారి పరిధిలోని కొన్ని సర్కిళ్ల నుంచి ప్రతి నెలా మామూళ్లు వసూలు చేసేవారనే ఆరోపణలు ఉన్నాయి. సర్కిల్ స్థాయిలోనే నెలవారీ వసూళ్ల వ్యవస్థ నడిచేదనే ప్రచారం పోలీస్ వర్గాల్లో వినిపిస్తోంది. ఉన్నతాధికారుల నుంచి మందలింపులు వచ్చినా వ్యవహారశైలిలో మార్పు రాలేదనే చర్చ కూడా ఉంది. అధికారిక బాధ్యతకు 'నెలవారీ వసూళ్ల'ను జోడించింది ఎవరు? అన్న ప్రశ్నకు సమాధానం రావాల్సి ఉంది.

### ఖాకీ కంటే నోటి దురుసే ఎక్కువా?

అధికారిగా కింది స్థాయి సిబ్బందికి మార్గనిర్దేశం చేయాల్సిన వ్యక్తి.. వారితో అసభ్య పదజాలంతో మాట్లాడేవారనే ఆరోపణలు ఉన్నాయి. దురుసు ప్రవర్తనతో విసిగిపోయి పలువురు డ్రైవర్లు, సిబ్బంది విధులు వదిలి వెళ్లారని.. అటువంటి వారి సంఖ్య 50కి పైగా ఉంటుందని కూడా ప్రచారం జరుగుతోంది.

### ఇది నిజమైతే..

ఒక అధికారికి వ్యతిరేకంగా ఇంతమంది సిబ్బంది ఎందుకు వెళ్లిపోయారు? అనే అంశంపై శాఖాపరమైన సమీక్ష అవసరం. 20 ఎకరాల భూమి.. ఆస్తులపై ప్రశ్నలు. సదరు ఐపీఎస్ అధికారి పరిధిలోని ప్రాంతాల్లో 20 ఎకరాలకు పైగా భూములు కొనుగోలు చేశారనే ప్రచారం కూడా పోలీస్ శాఖలో వినిపిస్తోంది.

### ఆస్తులు ఎలా సమకూరాయి?

కొనుగోళ్లకు ఆర్థిక వనరులు ఏమిటి? ఆస్తుల వివరాలు అధికారిక రికార్డులతో సరిపోతున్నాయా? ఇలాంటి ప్రశ్నలకు సంబంధిత సంస్థల విచారణలోనే సమాధానం దొరకాల్సి ఉంది.

### వాహనాలు పదుల సంఖ్యలో.. సిబ్బంది అంతకంటే ఎక్కువ?

ప్రభుత్వ వనరుల పొదుపుపై చర్చ జరుగుతున్న సమయంలో.. సదరు అధికారి వినియోగానికి పదుల సంఖ్యలో వాహనాలు, వాటి నిర్వహణకు భారీ సంఖ్యలో సిబ్బంది ఉండేవారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వాహనాలు, ఇంధనం, సిబ్బంది వినియోగంపై శాఖాపరమైన ఆడిట్ జరిగితే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

### చివరికి డీజీ ఆఫీస్‌కు అటాచ్‌మెంట్.

ఒకవైపు పోలీస్ శాఖలో అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్న వేళ.. మరోవైపు ఈ అధికారి చుట్టూ ఆరోపణలు వెల్లువెత్తడం.. చివరకు డీజీ కార్యాలయానికి అటాచ్‌మెంట్ రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామంతో ఆయా జిల్లాల పోలీస్ వర్గాల్లో ఉపశమనం వ్యక్తమవుతోందనే ప్రచారం కూడా ఉంది.

### ఆరోపణల వెనుక అసలు నిజమేంటి?.

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.

ఇన్‌స్పెక్షన్లలో వసూళ్ల ఆరోపణలు నిజమేనా?

బదిలీల్లో డబ్బులు చేతులు మారాయా?

నెలవారీ మామూళ్ల వ్యవస్థ ఉందా?

20 ఎకరాల భూముల కొనుగోలు వెనుక ఆర్థిక వనరులేంటి?

కింది స్థాయి సిబ్బంది ఆరోపణల్లో నిజమెంత?

ఈ ప్రశ్నలకు సమాధానం రావాలంటే స్వతంత్ర దర్యాప్తు, శాఖాపరమైన విచారణ, ఆస్తులపై సమగ్ర పరిశీలన జరగాలి.

ఆరోపణలు నిజమైతే ఖాకీకి మచ్చ తెచ్చిన వారిపై కఠిన చర్యలు తప్పవు.

ఆరోపణలు అవాస్తవమైతే.. వాటి వెనుక ఉన్న నిజాలను కూడా ప్రభుత్వం ప్రజల ముందుంచాలి.

ఎందుకంటే ఇది ఒక్క అధికారి వ్యవహారం కాదు..

పోలీస్ శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకానికి సంబంధించిన విషయం.

జై భీమ్ దినపత్రిక సూటి ప్రశ్న.

"ఖాకీకి అధికారం ఉందని ప్రజలు భయపడాలా..? ఖాకీ నిజాయితీగా ఉందని ప్రజలు గర్వపడాలా..?"




# పేపర్ లీకేజీలపై విద్యార్థుల ఆందోళనను అణచివేయడం సరికాదు

**కేయూలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ దిష్టిబొమ్మ దహనం**
**విద్యార్థులపై లాఠీచార్జి, భాష్పవాయు ప్రయోగాన్ని ఖండించిన ఏబీవీపీ**

**కేయూ క్యాంపస్, 12 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

జార్ఖండ్ రాష్ట్రంలో జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం, భాష్పవాయు గోళాలు, వాటర్ కేనన్లు ప్రయోగించడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ చేపట్టిన దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ పేపర్ లీకేజీలపై జార్ఖండ్ విద్యార్థులు 19 రోజులుగా శాంతియుతంగా పోరాడుతున్నారని తెలిపారు. తమ సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన 'విధానసభ గెరావ్' కార్యక్రమంలో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, భాష్పవాయు గోళాలు, వాటర్ కేనన్లు ప్రయోగించడం హేయమైన చర్య అని ఖండించారు. న్యాయమైన డిమాండ్ల కోసం విద్యార్థులు పోరాడుతుంటే ప్రభుత్వం పోలీసు బలంతో ఉద్యమాన్ని అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. పేపర్ లీకేజీలపై ఈడీ, సీబీఐతో విచారణ జరిపించాలని, జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ బోర్డు సభ్యులను అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరీక్షా బోర్డులను పూర్తిగా ప్రక్షాళన చేసి, జరిగిన పరీక్షలను రద్దు చేసి, కొత్త పరీక్షల క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్న విద్యార్థులకు దేశంలోని ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా నిలవకపోవడం విచారకరమని రాంబాబు అన్నారు. విద్యార్థులపై పోలీసులతో లాఠీచార్జి చేయించినందుకు బాధ్యత వహిస్తూ జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జార్ఖండ్ విద్యార్థులు ఒంటరిగా లేరని, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌తో పాటు దేశవ్యాప్తంగా విద్యార్థి సమాజం వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల డిమాండ్లు నెరవేరే వరకు వారి పోరాటానికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ ప్రముఖ్ అంబాల కిరణ్, యూనివర్సిటీ ఇన్‌చార్జి డా. నిమ్మల రాజేష్, యూనివర్సిటీ కార్యదర్శి మేకల జ్ఞానేశ్వర్, వినోద్, పవన్, ప్రణయ్, అఖిల్, పవన్ కల్యాణ్, సుమన్, రమేష్, దేవి, పండు, మణికాంత్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.





# విభాగధిపతిని సన్మానించిన విద్యా కళాశాల ప్రిన్సిపాల్.

**ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి సేవలు కొనియాడదగినవి.**
**నిజాయితీకి మారుపేరు ఆచార్య పెదమళ్ళ శ్రీనివాసరావు.**
**మానవీయ భవనం మరపురాని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్.**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**



కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ పాలన శాస్త్రం,మానవ వనరుల విభాగా అధిపతి ఆచార్య శ్రీనివాసరావు పెదమళ్ళ ను కాకతీయ విశ్వవిద్యాలయ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాసరావు సన్మానించారు.బుధవారం విభాగధిపతి ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి విభాగ అధిపతి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూస్తూ సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ స్పందిస్తూ కాకతీయ విశ్వవిద్యాలయంలో నిజాయితీ నిబద్ధతతో పనిచేసే ఆచార్యులలో ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య శ్రీనివాసరావు ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారని అభినందించారు.మానవీయ భవనం కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేకతను చాటుకుంటుందని ముఖ్యంగా చెట్లు నాటే కార్యక్రమం, చెట్లను పెంచే కార్యక్రమం పెంచిన చెట్లను కాపాడుకునే కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తున్నారని ఇలాంటి నిరంతర కార్యక్రమంలో నిర్విరామం లేకుండా సేవలందిస్తున్న ఆచార్య శ్రీనివాసరావు వ్యక్తిత్వం అద్భుతమని కొనియాడారు.

# క్రీడలతోనే ఆరోగ్యం.. ఉల్లాసం..

**కేయూ ఉద్యోగులకు క్రీడా పోటీలు ప్రారంభించిన ఆచార్య బి. వెంకట్రామ్ రెడ్డి**





**కేయూ క్యాంపస్, 12 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో బోధన, బోధనేతర ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను విశ్వవిద్యాలయ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా బృందస్ఫూర్తి, పోటీతత్వం, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడపై ఆసక్తి పెంచుకొని, నిత్య జీవితంలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలను కేవలం పోటీగా కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి

**వన్యప్రాణుల వేటగాళ్లను పట్టుకునేందుకు వెళ్లి విషాదం.. ఘటనపై సమగ్ర దర్యాప్తుకు మంత్రి కొండా సురేఖ ఆదేశం**

**భద్రాద్రి కొత్తగూడెం, 12 ఆగస్టు 2026 ( జై భీమ్ న్యూస్)**



వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెరువుసింగారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతి చెందడం పట్ల అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జంతువులను వేటాడుతున్నారన్న సమాచారంతో అనుమానితులను పట్టుకునేందుకు మరో ముగ్గురు బీట్ ఆఫీసర్లతో కలిసి నవీన్ బూర్గంపాడు మండలం నకిరేపేట గ్రామానికి వెళ్లారు. విధి నిర్వహణలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ మంత్రికి వివరించారు. ఈ ఘటనపై మంత్రి కొండా సురేఖ డీఎఫ్ఓతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వన్యప్రాణులు, అటవీ సంపద సంరక్షణలో అటవీ సిబ్బంది చేస్తున్న సేవలు అమూల్యమైనవని ఆమె అన్నారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం అత్యంత ప్రమాదకరమని, ఇలాంటి అక్రమ చర్యలతో వన్యప్రాణులతో పాటు అటవీ సిబ్బంది, స్థానిక ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నవీన్ మృతికి కారణమైన ఘటనపై అటవీ, పోలీసు శాఖలు సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మృతుడు నవీన్ కుటుంబానికి మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ నిబంధనల ప్రకారం నవీన్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పీసీసీఎఫ్ వినయ్ కుమార్‌ను ఆదేశించారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# కాలుష్య నివారణకు ముందస్తు చర్యలు, ప్రజల్లో అవగాహనతోనే సుస్థిర అభివృద్ధి





**కాలుష్యం ఏర్పడిన తర్వాత నియంత్రించడం కంటే మూలంలోనే నివారణకు ప్రాధాన్యం**
**వీసీ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**
**కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం**

**కేయూ క్యాంపస్, 12 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాలుష్యం ఏర్పడిన తర్వాత నియంత్రించడం కంటే, కాలుష్యానికి దారితీసే కారణాలను ముందుగానే గుర్తించి మూలంలోనే నివారించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించవచ్చని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర నిపుణుల పర్యావరణ అంచనా కమిటీ, తెలంగాణ కాలుష్య నియంత్రణ అప్పిలేట్ అథారిటీ, పర్యావరణ నిపుణుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సెనెట్ హాల్‌లో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. "సుస్థిర అభివృద్ధి కోసం సంస్థల సమన్వయం–కాలుష్య నియంత్రణకు వ్యూహాత్మక, బహుళ భాగస్వామ్య విధానం" అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత శతాబ్దాల్లో జరిగిన శాస్త్రీయ ఆవిష్కరణలు, పారిశ్రామికీకరణ మానవ జీవనాన్ని సౌకర్యవంతం చేసినప్పటికీ ప్రకృతి, పర్యావరణంపై వాటి దుష్ప్రభావాలను తగినంతగా పరిగణనలోకి తీసుకోలేదని ఆచార్య ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. భూమి, నీరు, ఆహారం వంటి సహజ వనరుల అధిక వినియోగం పర్యావరణ కాలుష్యానికి దారితీస్తోందన్నారు. స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన జీవనం ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని సూచించారు. కాలుష్యం ఏ ఒక్క ప్రాంతానికో, సంస్థకో పరిమితమైన సమస్య కాదని, ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, సమాజం, యువత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛమైన సాంకేతికత, వ్యర్థాల తగ్గింపు, పునర్వినియోగం, వనరుల సమర్థ వినియోగంతో పాటు కృత్రిమ మేధ, భౌగోళిక సమాచార వ్యవస్థ, దూర సంచేతన, వాస్తవ కాల పర్యవేక్షణ వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగించాలని సూచించారు. విశ్వవిద్యాలయాల పరిశోధనలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా సమాజానికి చేరాలని, పరిశోధన ఫలితాలు ఆచరణలోకి రావాలని అన్నారు.

**అభివృద్ధితో పాటు పర్యావరణ సమగ్రతను కాపాడాలి**

రాష్ట్ర నిపుణుల పర్యావరణ అంచనా కమిటీ చైర్మన్, విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి డా. ఎం. రామ్‌గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, పట్టణీకరణతో పాటు పర్యావరణ సమగ్రతను కాపాడటమే సుస్థిర అభివృద్ధి లక్ష్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం విధానపరమైన అంశం మాత్రమే కాకుండా రాజ్యాంగబద్ధమైన, నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల పర్యావరణ ప్రభావాలను శాస్త్రీయంగా అంచనా వేసే సంస్థలను అభివృద్ధికి అడ్డంకులుగా చూడకుండా, పర్యావరణపరంగా సురక్షితమైన, సామాజికంగా ఆమోదయోగ్యమైన అభివృద్ధికి మార్గదర్శక సంస్థలుగా చూడాలని సూచించారు. ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, స్థానిక సమాజాల మధ్య సమన్వయం అవసరమన్నారు.

**పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ బాధ్యత**

తెలంగాణ కాలుష్య నియంత్రణ అప్పిలేట్ అథారిటీ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ బాధ్యత అని అన్నారు. రాజ్యాంగంలోని 48ఏ అధికరణ, 51ఏ(జి) అధికరణలు పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వం, పౌరుల బాధ్యతలను స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రాజ్యాంగంలోని 21వ అధికరణలోని జీవించే హక్కులో స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణంలో జీవించే హక్కు కూడా భాగమని పేర్కొన్నారు. పర్యావరణ ప్రభావ అంచనా, పర్యావరణ అనుమతులు, పర్యవేక్షణ, తనిఖీలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలు పర్యావరణ పాలనలో కీలకమన్నారు. పర్యావరణ నిబంధనల పాటింపు కేవలం చట్టపరమైన బాధ్యతగా కాకుండా ప్రతి ఒక్కరి జీవన సంస్కృతిగా మారాలని పిలుపునిచ్చారు.

**స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలే భవిష్యత్తుకు పునాదులు**

కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య రవీంద్రనాథ్ కీలకోపన్యాసం చేస్తూ స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, సారవంతమైన నేలే సుస్థిర భవిష్యత్తుకు పునాదులని అన్నారు. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, జనాభా పెరుగుదల కారణంగా ప్లాస్టిక్ వినియోగం, విచక్షణారహిత వ్యర్థాల పారవేత పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారాయని తెలిపారు. కాలుష్య నియంత్రణ కంటే కాలుష్య నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పర్యావరణ అవగాహనను ఉన్నత విద్యలో భాగం చేయాలని, జాతీయ విద్యా విధానం–2020 స్ఫూర్తితో భారతీయ జ్ఞాన వ్యవస్థలు, వారసత్వం, సంస్కృతి, మానవ విలువలు, లింగ సమానత్వం, పర్యావరణ చైతన్యం, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్య కేవలం ఉద్యోగం కోసం కాకుండా బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దేలా ఉండాలని అన్నారు.

**సంస్థల సమిష్టి భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ**

తెలంగాణ కాలుష్య నియంత్రణ అప్పిలేట్ అథారిటీ సభ్యుడు, సదస్సు అధ్యక్షుడు ఆచార్య గాదె దయాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రజారోగ్యం, ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం, వాతావరణ స్థిరత్వంతో ముడిపడి ఉందన్నారు. వాయు, నీరు, నేల కాలుష్యం, భూగర్భ జలాల క్షీణత, జీవవైవిధ్య నష్టం, వాతావరణ మార్పులు ప్రధాన సవాళ్లుగా మారాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు శాస్త్రం, చట్టం, విధానాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, సమాజం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ ప్రభావ అంచనాను కేవలం అనుమతుల ప్రక్రియగా కాకుండా పర్యావరణ ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించే శాస్త్రీయ సాధనంగా చూడాలని సూచించారు. నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణహిత జీవనశైలి ప్రతి పౌరుడి బాధ్యతగా మారాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అతిథుల చేత సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీడిమెట్ల జెఈటీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బక్కారెడ్డి, హైదరాబాద్ టీఎస్‌డీఎఫ్ ప్రాంతీయ అధిపతి రాధాకృష్ణ సాయి, హెటెరో డ్రగ్స్ సీనియర్ జనరల్ మేనేజర్ డా. ఈహెచ్‌ఎస్ హరి, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. దినేష్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య పి. వెంకటేశ్వర్ రావు, సైన్స్ విభాగాల డీన్ ఆచార్య జి. హనుమంత్, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గురువారం జరగనున్న సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బి. బాలకిష్టా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.




# కేయూలో ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలు

**గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా. ఎస్.ఆర్. రంగనాథన్ సేవలు చిరస్మరణీయం**
**జ్ఞాన సమాజ నిర్మాణంలో గ్రంథాలయాల పాత్ర కీలకం.**
**రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం**





**కేయూ క్యాంపస్, 12 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రంథాలయ శాస్త్ర పితామహుడు పద్మశ్రీ డా. ఎస్.ఆర్. రంగనాథన్ 134వ జయంతిని పురస్కరించుకొని కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ లైబ్రరీలో బుధవారం గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ లైబ్రరీ, కాకతీయ విశ్వవిద్యాలయ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం, తెలంగాణ స్టేట్ లైబ్రరీ అసోసియేషన్, వరంగల్ జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం హాజరయ్యారు. తొలుత డా. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా. ఎ. నాగేశ్వర్ రావు మాట్లాడుతూ భారతదేశంలో గ్రంథాలయ ఉద్యమానికి డా. ఎస్.ఆర్. రంగనాథన్ చేసిన సేవలు అపూర్వమైనవని అన్నారు. కేయూఎల్‌పీఏ ప్రధాన కార్యదర్శి వి. కృష్ణమాచార్య సంఘం వార్షిక నివేదికను సమర్పించారు. ముఖ్య వక్త ప్రొఫెసర్ కె. రమణయ్య మాట్లాడుతూ జ్ఞాన సమాజ నిర్మాణంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఆధునిక సమాజంలో గ్రంథాలయాల ప్రాధాన్యత మరింత పెరుగుతోందని డి. సత్యనారాయణ రావు పేర్కొన్నారు.

**ఏఐ యుగంలోనూ రంగనాథన్ ఆలోచనలు మార్గదర్శకం**


మెంబర్ ఇన్‌చార్జి, విభాగాధిపతి డా. బి. రాధికా రాణి మాట్లాడుతూ కృత్రిమ మేధ యుగంలో గ్రంథాలయాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పాఠకులకు వేగవంతమైన, నాణ్యమైన సమాచార సేవలను అందించాలని అన్నారు. ఏఐ వచ్చినప్పటికీ పాఠకుడిని కేంద్రంగా చేసుకున్న డా. రంగనాథన్ ఆలోచనలు నేటికీ ఎంతో ప్రాసంగికంగా ఉన్నాయని తెలిపారు.

**ఉత్తమ గ్రంథపాలకుడికి పురస్కారం**

గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా వివిధ పురస్కారాలను అందజేశారు. ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథపాలకుడు డా. బి. జగదీశ్‌కు ఉత్తమ గ్రంథపాలకుడి పురస్కారం ప్రదానం చేశారు. 2024--25 ఎంఎల్‌ఐఎస్సీ ప్రథమ ర్యాంకర్ మిస్ మోరా నిఖితకు కొండల్ రెడ్డి మెమోరియల్ గోల్డ్ మెడల్, ఎం.ఫార్మసీ ద్వితీయ సెమిస్టర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మిస్ జి. కావ్యకు ఉత్తమ పాఠకురాలి పురస్కారం అందజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. డిజిటల్ యుగంలో పుస్తక పఠనంతో పాటు డిజిటల్ వనరులను కూడా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రొఫెసర్ వి. రామచంద్రంను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డా. జి. రాజేశ్వర్ కుమార్, ఎం. కోటేశ్వర్ రావు, డా. అంజయ్య, ఎం. యుగంధర్ రావు, టి. జవహర్, డా. ఇంద్రసేన రెడ్డి, డా. నిరంజన్, అనురాధ, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాలభైరవ స్వామిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ దంపతులు

**కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు.. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు**





**హైద్రాబాద్, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

నాంపల్లి దేవిబాగ్‌లోని శ్రీ కాలభైరవ స్వామి (భైరవ బాబా మందిర్) ఆలయాన్ని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావు దంపతులు దర్శించుకున్నారు. వారి కుమార్తె సుస్మితా పటేల్, అల్లుడు అభిలాష్ పటేల్‌లతో కలిసి ఆలయానికి వెళ్లిన మంత్రి దంపతులు కాలభైరవ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయంలో కాలభైరవ స్వామికి విశిష్టమైన స్థానం ఉందన్నారు. పరమశివుని ఉగ్రరూపంగా, క్షేత్రపాలకుడిగా, ధర్మ పరిరక్షకుడిగా భక్తులు కాలభైరవ స్వామిని ఆరాధిస్తారని తెలిపారు. స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా భయాలు తొలగి ధైర్యం, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక బలం చేకూరుతాయని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాలభైరవ స్వామిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ఆలయాల ఆధ్యాత్మిక వైభవాన్ని, పురాతన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రి కొండా సురేఖతో పాటు కుటుంబ సభ్యులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు.

# ఇజ్రాయెల్ పట్టణ నీటి నిర్వహణ విధానాలు స్ఫూర్తిదాయకం

**వరంగల్ నగర నీటి వ్యవస్థలో అధ్యయన పర్యటన అనుభవాల వినియోగం: కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్**

**హన్మకొండ, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

పట్టణాల్లో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న విధానాలు, సమర్థవంతమైన పాలనా వ్యవస్థలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు ఇజ్రాయెల్‌లోని వివిధ నగరాల్లో నిర్వహించిన అర్బన్ వాటర్ మేనేజ్‌మెంట్ అధ్యయన పర్యటనలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ నీటి నిర్వహణ, నీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం, నీటి మౌలిక వసతుల నిర్వహణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. నీటి కొరతను సవాలుగా కాకుండా సాంకేతికత, ఆవిష్కరణలు, సమర్థవంతమైన పాలన ద్వారా అవకాశంగా మార్చుకోవడంలో ఇజ్రాయెల్ అనుభవాలు ఎంతో విలువైనవని కలెక్టర్ పేర్కొన్నారు. సముద్రపు నీటిని శుద్ధి చేసి వినియోగించడం, శుద్ధి చేసిన మురుగునీటిని దాదాపు 90 శాతం వరకు వ్యవసాయ అవసరాలకు పునర్వినియోగించడం, జీఐఎస్ ఆధారిత నీటి మౌలిక వసతుల మ్యాపింగ్, నాన్-రెవెన్యూ వాటర్ (ఎన్‌ఆర్‌డబ్ల్యూ)ను 5 శాతం కంటే తక్కువ స్థాయిలో నియంత్రించడం వంటి విధానాలు ఇజ్రాయెల్ సాధించిన పురోగతికి నిదర్శనమని తెలిపారు. నదుల పునరుజ్జీవనం, పట్టణ జల వనరుల పరిరక్షణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, ఎడారీకరణ నివారణకు చేపడుతున్న పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నీటి నిర్వహణలో వినియోగిస్తున్న తీరును అధ్యయనం చేసినట్లు తెలిపారు. అధ్యయన పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్‌లో భారత రాయబారి జె.పి. సింగ్‌ను కలుసుకుని భారత్--ఇజ్రాయెల్ సహకారం, ముఖ్యంగా పట్టణ నీటి నిర్వహణ రంగంలో ఉన్న అవకాశాలపై చర్చించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన నుంచి పలు విలువైన సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ పర్యటన ద్వారా పొందిన అనుభవాలు వరంగల్ నగర అండర్‌గ్రౌండ్ సీవరేజ్ సిస్టమ్ (యూజీఎస్‌ఎస్), తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, జీఐఎస్ ఆధారిత నీటి మౌలిక వసతుల నిర్వహణ, నాన్-రెవెన్యూ వాటర్ తగ్గింపు, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పట్టణ చెరువులు, కుంటలు, ఇతర జల వనరుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాల్లో ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ అధ్యయన పర్యటనలో ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో పాటు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యే, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ డైరెక్టర్లు, పట్టణాభివృద్ధి రంగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.



# గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలో అసలేం జరుగుతోంది?

**40 వేల వ్యవహారంపై ఫిర్యాదు.. ఫేక్ రసీదు ఆరోపణలు..**
**కమిటీ విచారణ ఏమైంది?**
**చర్యలు తీసుకున్నారా? లేక బదిలీతోనే వ్యవహారాన్ని ముగించారా?**
**ఉద్యోగిని కాపాడుతున్న 'అదృశ్య హస్తం' ఎవరిది?**
**కాశిబుగ్గ సర్కిల్‌లో కొందరు అధికారుల తీరుపై ఉద్యోగుల్లో గుసగుసలు**

**కాశీబుగ్గ, 12 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థలో ఓ ఉద్యోగిపై వచ్చిన ఆరోపణల వ్యవహారం ఇప్పుడు పలు ప్రశ్నలకు తావిస్తోంది. ఒక ఇంటి యజమాని నుంచి రూ.40 వేలు తీసుకున్నారనే ఆరోపణ, అందుకు సంబంధించి ఫేక్ రసీదు ఇచ్చారనే ఫిర్యాదు నేపథ్యంలో విచారణకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. అయితే విచారణలో ఏం తేలింది? కమిటీ ఏం నివేదించింది? ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, తాజాగా కాశిబుగ్గ సర్కిల్--1 డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి 06-08-2026 తేదీతో జారీ అయిన అధికారిక ఉత్తర్వులో, కాశిబుగ్గ సర్కిల్--1లో ఇన్‌చార్జ్ బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అతని పై కొన్ని ఆరోపణలు/ఫిర్యాదులు అందినట్లు పేర్కొంటూ, ఆయన సేవలను చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌కు అప్పగించి డంపింగ్ యార్డులో తదుపరి పోస్టింగ్ కోసం పంపినట్లు స్పష్టంగా ఉంది.

**అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.**

**విచారణ జరిగితే.. నివేదిక ఏమైంది?**

ఒక ఉద్యోగిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు సాధారణంగా ఫిర్యాదుల వాస్తవాలను పరిశీలించేందుకు విచారణ చేపడతారు. ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమని తేలితే ఫిర్యాదు వెనుక ఉన్న వాస్తవాలను వెల్లడించాలి. కానీ ఈ వ్యవహారంలో విచారణ కమిటీ నివేదికలో ఏముంది? రూ.40 వేల నగదు తీసుకున్నారనే ఆరోపణ నిజమా? ఫేక్ రసీదు ఇచ్చారనే ఆరోపణ నిజమా? ఆ రసీదు ఎవరి పేరుతో జారీ అయింది? దానికి సంబంధించి అధికారిక రికార్డులు పరిశీలించారా? ఫిర్యాదు చేసిన ఇంటి యజమానిని విచారించారా? ఉద్యోగి నుంచి వివరణ తీసుకున్నారా? కమిటీ ఏం తేల్చింది? విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారా? ఈ ప్రశ్నలకు అధికారిక సమాధానం రావాల్సి ఉంది. ఆరోపణలు నిజమైతే బదిలీ మాత్రమే ఎందుకు?

**అత్యంత కీలకమైన ప్రశ్న ఇదే.**

ఒకవేళ రూ.40 వేలు తీసుకున్నారనే ఆరోపణ నిజమైతే, ఫేక్ రసీదు ఇచ్చారనే ఆరోపణ నిజమైతే.. కేవలం మరో విభాగానికి పంపించడం ఎందుకు? అది తప్పిదమైతే శాఖాపరమైన చర్యలు ఎందుకు లేవు? నిబంధనల ఉల్లంఘన జరిగితే సస్పెన్షన్ ఎందుకు లేదు? తీవ్రమైన అక్రమం నిర్ధారణైతే తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదు? మరోవైపు ఆరోపణలు పూర్తిగా అవాస్తవమైతే.. అది కూడా అధికారికంగా ఎందుకు ప్రకటించలేదు? ఫిర్యాదు అబద్ధమైతే ఫిర్యాదు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆరోపణలు నిజమైతే సంబంధిత ఉద్యోగిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ రెండింటి మధ్యలో బదిలీ లేదా పోస్టింగ్ మార్పుతో వ్యవహారం ముగిసినట్లు కనిపించడం ఇప్పుడు అనేక అనుమానాలకు కారణమవుతోంది.

**'డంపింగ్ యార్డ్' పోస్టింగ్‌తో సమస్య పరిష్కారమైందా?**

అధికారిక ఉత్తర్వులో సదరు ఉద్యోగిని చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌కు అప్పగించి డంపింగ్ యార్డులో తదుపరి పోస్టింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు.

**ఇది చర్యా?**

లేక సాధారణ పరిపాలనా బదిలీనా? ఈ విషయం కూడా జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారులే స్పష్టం చేయాల్సి ఉంది. ఎందుకంటే ఒక ఉద్యోగిపై ఫిర్యాదు వచ్చిందంటే దాని వాస్తవాలను నిర్ధారించకుండా కేవలం స్థానం మార్చడం ద్వారా సమస్యకు పరిష్కారం లభించదు. అదే సమయంలో ఆరోపణలు నిరాధారమైతే ఆ ఉద్యోగిపై అనవసర ఆరోపణలు చేసిన వారిపై కూడా తగిన చర్యలు ఉండాలి.

**గత వ్యవహారాలను కూడా పరిశీలించాల్సిందేనా?**

ప్రస్తుతం ఉద్యోగుల్లో వినిపిస్తున్న మరో అంశం కూడా అధికారుల దృష్టికి రావాల్సిన అవసరం ఉంది. గతంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగి మరో ఉద్యోగికి సంబంధించిన ఆర్ఐ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను ఉపయోగించి ఫైల్ మూవ్‌మెంట్ చేసిన ఘటనపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారని, 2021లో చీటింగ్ కేసు కూడా నమోదైందని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ అంశానికి ప్రస్తుత ఆరోపణలతో ప్రత్యక్ష సంబంధం ఉందా? లేదా? అనేది అధికారిక రికార్డుల ఆధారంగా మాత్రమే నిర్ధారించాల్సి ఉంటుంది.

**అయితే ఉద్యోగ వర్గాల్లో ఒకే ప్రశ్న వినిపిస్తోంది**

గతంలో లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ వినియోగం వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకున్న అధికారులు.. ఇప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి విషయంలో ఏ విధానాన్ని అనుసరిస్తున్నారు? అందరికీ ఒకే నిబంధనలేనా? లేక వ్యక్తిని బట్టి నిర్ణయాలు మారుతున్నాయా? 'అదృశ్య హస్తం' ఉందా? ఇదే ఇప్పుడు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో ఎక్కువగా చర్చకు వస్తున్న అంశం. సదరు ఉద్యోగికి ఎవరైనా ఉన్నతస్థాయి అండదండలు ఉన్నాయా? ఎవరైనా రాజకీయ జోక్యం చేసుకున్నారా? కార్యాలయంలోని కొందరు అధికారులు వ్యవహారాన్ని 'మేనేజ్' చేశారా? ఆరోపణలు ఉన్నప్పటికీ తిరిగి ఉద్యోగ బాధ్యతల్లో కొనసాగడానికి ఎవరి సహకారం ఉంది? ఇవన్నీ ప్రస్తుతం ఆరోపణలు, అనుమానాలు, ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్న చర్చలు మాత్రమే. వీటిలో వాస్తవం ఎంత ఉందో జీడబ్ల్యూఎంసీ అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ప్రత్యేకంగా కాశిబుగ్గ సర్కిల్‌లో కొందరు అధికారులు గత కొంతకాలంగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారనే చర్చ కూడా ఉద్యోగుల్లో ఉంది. అయితే ఇది కూడా అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిన అంశమే.

**కమిషనర్ స్పందించాల్సిన ప్రశ్నలు**

ఈ వ్యవహారంపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సమగ్రంగా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

1. రూ.40 వేల తీసుకున్నారనే ఫిర్యాదు నిజమేనా?
2. ఫేక్ రసీదు జారీ చేసినట్లు ఆధారాలు లభించాయా?
3. ఈ అంశంపై విచారణ కమిటీ ఏర్పాటు చేశారా?
4. కమిటీ నివేదిక ఏమి చెప్పింది?
5. నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?
6. ఆరోపణలు నిజమైతే సస్పెన్షన్ లేదా ఇతర శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు?
7. ఆరోపణలు నిరాధారమైతే ఫిర్యాదుదారుడిపై చర్య ఎందుకు తీసుకోలేదు?
8. డంపింగ్ యార్డుకు పంపడం శిక్షా చర్యా? లేక సాధారణ బదిలీనా?
9. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగికి తిరిగి విధులు అప్పగించే ముందు ఎలాంటి పరిశీలన జరిగింది?
10. ఈ వ్యవహారంలో ఎవరైనా రాజకీయ లేదా అధికారిక జోక్యం చేసుకున్నారా?

**పారదర్శక విచారణే అనుమానాలకు ముగింపు**

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయి, జారీ చేసే ప్రతి రసీదు, నిర్వహించే ప్రతి ఫైల్‌పై పూర్తి పారదర్శకత ఉండాలి. ఒక ఉద్యోగిపై ఫిర్యాదు వస్తే దాన్ని కప్పిపుచ్చడం కానీ, కేవలం బదిలీతో సమస్యను ముగించడం కానీ ప్రజల్లో అనుమానాలకు తావిస్తుంది. ఫిర్యాదు నిజమైతే చర్య తీసుకోవాలి. ఫిర్యాదు అబద్ధమైతే అది కూడా స్పష్టం చేయాలి. మధ్యలో అనుమానాలకు తావిచ్చే నిర్ణయాలు తీసుకోకూడదు. రూ.40 వేల వ్యవహారంలో నిజానిజాలు ఏమిటో, ఫేక్ రసీదు ఎవరు ఇచ్చారో, విచారణ కమిటీ ఏం తేల్చిందో, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగికి ఎందుకు మరో పోస్టింగ్ ఇచ్చారో జీడబ్ల్యూఎంసీ అధికారులు ప్రజలకు వెల్లడిస్తేనే ఈ వ్యవహారంపై వస్తున్న అనుమానాలకు తెరపడుతుంది. లేకపోతే 'ఎవరిని కాపాడుతున్నారు?' అనే ప్రశ్న మరింత బలపడే అవకాశం ఉంది. ప్రజల నుంచి వసూలు చేసే సొమ్ము విషయంలోనూ, అధికారిక రసీదుల విషయంలోనూ, ఉద్యోగులపై వచ్చే ఆరోపణల విచారణలోనూ ఒకే నిబంధన, ఒకే ప్రమాణం, ఒకే విధమైన చర్య ఉండాలని ప్రజలు, ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి. ఇప్పటికైనా జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై పూర్తి వాస్తవాలను బహిర్గతం చేసి, ఆరోపణలు నిజమా? అబద్ధమా? అన్నది తేల్చడంతో పాటు, తప్పు చేసిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.




# యువత ఆరోగ్యమే సమాజానికి బలం

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. అప్పయ్య**
**హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు ప్రారంభం**






**హన్మకొండ, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ యువ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్, ఎస్‌టీఐలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. అప్పయ్య ప్రభుత్వ టీబీ ఆసుపత్రిలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. అప్పయ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యువతకు హెచ్ఐవీపై సరైన సమాచారం, అవసరమైన సేవలను డిజిటల్ వేదికల ద్వారా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) రూపొందించిన "బ్రేక్ ఫ్రీ యాప్" ద్వారా హెచ్ఐవీకి సంబంధించిన సమాచారం, సేవలను యువత సులభంగా పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా యాప్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను అధికారులు, అతిథులు ఆవిష్కరించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డా. మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 181 గ్రామాలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, మహిళా సంఘాల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా యువతలో హెచ్ఐవీపై ఉన్న అపోహలను తొలగించి, సరైన సమాచారాన్ని చేరవేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు, సామాజిక కార్యకర్త ఈ.వీ. శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత హెచ్ఐవీ పట్ల సరైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై బాధ్యతగా వ్యవహరిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ టీబీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవి, ఆర్‌ఎంఓ డా. వెంకట రమణ, డీటీసీఓ డా. ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, డెమో అధికారులు అశోక్‌రెడ్డి, రామకృష్ణ, కమలాకర్, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి శ్రీనివాస్, కౌన్సిలర్ రాపర్తి సురేష్, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం చేస్తే చర్యలు తప్పవు

**డబ్బులు ఇవ్వనిదే పనులు కావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి..**
**ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి**
**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్**





**వరంగల్, 12 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**

మున్సిపల్ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అధికారులను హెచ్చరించారు. ప్రజల నుంచి ఫైళ్ల పెండింగ్‌పై, డబ్బులు ఇవ్వనిదే పనులు జరగడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలాంటి ఫిర్యాదులు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను, నల్లా పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, లక్ష్యాలను చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలతో వినయంగా, మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫైళ్లను అనవసరంగా పెండింగ్‌లో పెట్టకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ఫైళ్ల క్లియరెన్స్‌లో కావాలనే జాప్యం చేస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల నుంచి డబ్బులు తీసుకుని పనులు చేస్తున్నారనే ఆరోపణలకు తావివ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు అందించాల్సిన సేవల్లో నిర్లక్ష్యం, జాప్యం లేదా అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు మళ్లీ వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజా సేవలో నిర్లక్ష్యానికి తావులేదు.. పారదర్శకతే లక్ష్యం అన్న విధంగా అధికారులు పనిచేయాలని ఆయన ఆదేశించారు.

# ఆషాఢ అమావాస్య సందర్భంగా వారాహి ఆలయంలో ప్రత్యేక పూజలు

**హన్మకొండ, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఆషాఢ మాస ముగింపు అమావాస్య సందర్భంగా మారుతీల్స్ కాలనీ, న్యూ శాంపేట సర్కిల్, కెరియర్ పాయింట్ కాలేజ్ వెనుక వైపు చాకిరేవు గుట్టలోని శ్రీ వారాహి సహిత ఉన్మత్త భైరవ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి శ్రీ వారాహి అమ్మవారిని, ఉన్మత్త భైరవ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీరభద్రనాథ్ మాట్లాడుతూ ఆషాఢ మాస ముగింపు అమావాస్య ఎంతో విశిష్టమైనదని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని, ప్రతి ఒక్కరిపై శ్రీ వారాహి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోహన్ గౌడ్**

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని ఐనవోలు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు,జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశాల మేరకు వనమాలకనపర్తి,నర్సింహులగూడెం, ముల్కలగూడెం,కొండపర్తి గ్రామాల నూతన అధ్యక్షుల కోసం పేర్లు సేకరించే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మోహన్ గౌడ్ మాట్లాడారు....కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్తలేనని... రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నా, మన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నా ఈ కమిటీల నియామకం అత్యంత కీలకమని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామాల అధ్యక్షులు,సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు..



# పన్నుల లక్ష్య సాధనకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి

**ప్రతి ఇంటి నంబర్‌కు జియోట్యాగింగ్.. కొత్త నిర్మాణాల గుర్తింపుతో పన్నుల పరిధి విస్తరణ**

**టాప్ డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి.. జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్**

**హన్మకొండ, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రతి ఇంటి నంబర్‌ను జియోట్యాగ్ చేయడంతో పాటు కొత్త నిర్మాణాలు, ఆస్తుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పన్నుల పరిధిని విస్తరించాలని సూచించారు. బుధవారం హన్మకొండ ఐడీఓసీ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి ట్యాక్సేషన్, రెవెన్యూ అధికారులతో చాహత్ బాజ్‌పాయ్ సమీక్ష నిర్వహించారు. సర్కిళ్ల వారీగా ఆస్తిపన్నుల వసూళ్లు, కొత్త నిర్మాణాల గుర్తింపు, ప్రభుత్వ భవనాల రీ-అసెస్‌మెంట్, కమర్షియల్, నాన్ కమర్షియల్ భవనాలకు పన్నుల విధింపు, ఆన్ కలెక్టబుల్ డిమాండ్లు, డబుల్ అసెస్‌మెంట్లు, వీఎల్‌టీ వసూళ్లు, ప్రాపర్టీ రివిజన్, డ్రోన్ సర్వే, జియోట్యాగింగ్ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఇంటి నంబర్‌ను జియోట్యాగ్ చేసి ఆస్తికి సంబంధించిన పూర్తి వివరాలను డిజిటల్ రికార్డుతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. డ్రోన్ సర్వే ద్వారా గుర్తించిన నిర్మాణాలు, ఆస్తుల వివరాలను క్షేత్రస్థాయి రికార్డులతో సరిపోల్చి పన్నుల పరిధిలోకి రాని భవనాలను గుర్తించాలని సూచించారు. ప్రాపర్టీ రివిజన్ ప్రక్రియను వేగవంతం చేసి కొత్తగా ఏర్పడిన ఆస్తులు, నిర్మాణాల్లో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ భవనాల అసెస్‌మెంట్లను నిబంధనల మేరకు పునఃపరిశీలించాలని, కమర్షియల్, నాన్ కమర్షియల్ భవనాలను స్పష్టంగా గుర్తించి సంబంధిత కేటగిరీ ప్రకారం పన్నులు విధించాలని సూచించారు. సెల్ టవర్లు ఉన్న భవనాలను నిబంధనల ప్రకారం కమర్షియల్ కేటగిరీలో పరిగణించి పన్నులు విధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే ఆస్తికి రెండు అసెస్‌మెంట్ నంబర్లు ఉన్న డబుల్ అసెస్‌మెంట్లను ప్రత్యేకంగా గుర్తించి వాటి పూర్తి వివరాలను వారం రోజుల్లోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆన్ కలెక్టబుల్ డిమాండ్లను క్షుణ్ణంగా పరిశీలించి వసూలుకు అవకాశం ఉన్న బకాయిలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వసూలు కాని బకాయిలకు ఆర్ఆర్ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. నగర పరిధిలోని ప్రతి ప్లాట్‌ను గుర్తించి నిబంధనల మేరకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) వసూలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వీఎల్‌టీకి సంబంధించిన పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించి, 25 టైమ్స్ పెనాల్టీ మినహాయింపునకు సంబంధించిన పెండింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న టాప్ డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి సారించి బకాయిల వసూళ్లకు కార్యాచరణ రూపొందించాలని, సర్కిల్ వారీగా పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న ఆస్తులను పరిశీలించాలని సూచించారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యటించాలని తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లో జిఐఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రతి ఆస్తి, ఇంటి నంబర్, రహదారి, ప్రభుత్వ స్థలం, మున్సిపల్ ఆస్తి తదితర వివరాలను డిజిటల్ మ్యాపింగ్‌తో అనుసంధానం చేయాలని చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. భవిష్యత్‌లో పన్నుల నిర్వహణతో పాటు పట్టణ ప్రణాళిక, మౌలిక వసతుల అభివృద్ధి, ఆస్తుల పరిరక్షణకు జిఐఎస్ సమాచారం ఉపయోగపడేలా సమగ్ర డేటాబేస్ రూపొందించాలని అన్నారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ పన్నుల వసూళ్ల లక్ష్యాలను సర్కిల్, వార్డు స్థాయిలో విభజించి రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కొత్త అసెస్‌మెంట్లు, పెండింగ్ బకాయిలు, వీఎల్‌టీ, డబుల్ అసెస్‌మెంట్లు, కమర్షియల్ భవనాల గుర్తింపు వంటి అంశాలపై రెవెన్యూ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని అన్నారు. ఆస్తుల జియోట్యాగింగ్, పన్నుల అసెస్‌మెంట్, వసూళ్ల ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. సమీక్షలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్నారాణి, ట్యాక్సేషన్ అధికారి రామకృష్ణ, ఐటీ మేనేజర్ రమేష్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం వెబ్‌సైట్‌పై అధికారులకు అవగాహన శిక్షణ

**ఇకపై వైద్య సంస్థల నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో.. డిజిటల్ నమోదు ధ్రువపత్రాల జారీ**






**వరంగల్, 12 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం వెబ్‌సైట్, డిజిటల్ నమోదు విధానంపై అధికారులకు అవగాహన కల్పించే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభు కిరణ్ హాజరయ్యారు. శిక్షకులుగా రాష్ట్ర బృందం సభ్యులు సునీల్ రాజ్, కిరణ్ కుమార్, అనిల్ కుమార్, మొయినుద్దీన్ పాల్గొని వెబ్‌సైట్ వినియోగం, ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ అందించారు. కార్యక్రమానికి ఆతిథ్యం వహించిన వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం నమోదు చేసుకోవాల్సిన అల్లోపతి, ఆయుష్ ఆసుపత్రులు, వైద్యశాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, ఫిజియోథెరపీ కేంద్రాలు తదితర వైద్య సంస్థలు ఇకపై తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం వెబ్‌సైట్ ద్వారా సులభంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా హన్మకొండ, సిద్దిపేట జిల్లాల్లో ఈ డిజిటల్ విధానాన్ని అమలు చేసిన అనంతరం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేస్తున్నట్లు వివరించారు. చట్టం పరిధిలోకి వచ్చే అన్ని వైద్య సంస్థలు తప్పనిసరిగా నమోదు చేసుకొని, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు వైద్య సేవలు అందించాలని అధికారులు సూచించారు. ఇకపై డిజిటల్ నమోదు ధ్రువపత్రాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ వైద్య సంస్థలు కూడా ఆన్‌లైన్ విధానాన్ని సద్వినియోగం చేసుకొని తమ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, వివిధ జిల్లాల క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం సిబ్బంది ఎస్.ఓ. ప్రసన్న కుమార్, డిప్యూటీ డెమో రాజ్ కుమార్, ఆరోగ్య విద్యాధికారులు సంపత్, శ్రీదేవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుంది

**జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా వల్లభపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక కార్యక్రమం**

**ఎల్కతుర్తి, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వల్బాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక పఠనం, నూతన పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ రకాల పుస్తకాలను పరిచయం చేశారు. పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థుల వయసు, తరగతులకు అనుగుణంగా విభజించి చదివించారు. జీవిత చరిత్రలు, చారిత్రక అంశాలు, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, పర్యావరణం, గణితం, తెలుగు సాహిత్యంతో పాటు ఆంగ్లంలో బొమ్మలతో కూడిన చిన్న కథల పుస్తకాలు, సమకాలీన అంశాలకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ సూచనల మేరకు ప్రతి తరగతికి వారానికి ఒక పీరియడ్‌ను గ్రంథాలయానికి కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయ పీరియడ్‌ను సద్వినియోగం చేసుకుని పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విషయ పరిజ్ఞానం, వివేచనా శక్తి, విశ్లేషణాత్మక ఆలోచనా విధానం పెంపొందడంతో పాటు సమాజ పోకడలపై అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే పోటీ పరీక్షలకు గ్రంథాలయంలోని పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట సుహాసిని, వెంకట స్వామి, పద్మలత, కల్యాణి, రమాదేవి, శోభారాణి, ప్రేమ్ ప్రసాద్ రావు, అఖిల తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా వ్యాప్తంగా మొరం దందా!

**అధికారులు, పాలకుల తీరుకు అగ్నిపరీక్ష...**
**అనుమతులు ఉన్నాయా? అక్రమ తవ్వకాలా?**
**యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు.. టిప్పర్లతో భారీగా రవాణా**
**మైనింగ్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు**
**ప్రభుత్వాలు మారిన మొరం దందా మారడం లేదు**
**అధికారులు, నాయకులు, ఇతరులు కలిసి మొరం వ్యాపారం చేస్తున్నారు**
**నగరం మొత్తం నాణ్యమైన మొరం దందా నడుస్తుంది**
**ప్రజలు గగ్గోలు పెట్టి మొత్తుకున్న పట్టించుకోవడం లేదు**
**ఎక్కడి మొరం దందాను అక్కడనే వాహనాలను సీజ్ చేస్తూ క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**
**క్వారీల వెనుక రాజకీయ అండదండలున్నాయంటూ ఆరోపణలు**
**“మొరం మాఫియా”కు అడ్డూ అదుపూ లేదా?**

**హన్మకొండ, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా నలుమూలలా యంత్రాలతో మొరం తవ్వకాలు.. టిప్పర్లతో భారీగా తరలింపు.. అనుమతుల పరిధి ఎంత? వాస్తవంగా ఎంత మేరకు తవ్వకాలు జరుగుతున్నాయి? రాయల్టీ చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. మొరం తవ్వకాలపై సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ యంత్రాలతో గుట్టలు, భూములను తవ్వి మొరాన్ని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తవ్వకాల కారణంగా భారీ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తున్నప్పటికీ, మోటార్లతో నీటిని తోడుతూ మరింత లోతుగా తవ్వకాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. టిప్పర్ల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతినడంతో పాటు దుమ్ము, ధూళి సమస్యలు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అనుమతులు లేకుండా లేదా అనుమతించిన పరిమితికి మించి తవ్వకాలు జరుగుతున్నట్లయితే ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ ఆదాయానికి గండి పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అసలు జిల్లాలో ఎన్ని మొరం క్వారీలకు అనుమతులు ఉన్నాయి? వాటి పరిధి ఎంత? అనుమతించిన పరిమాణంలోనే తవ్వకాలు జరుగుతున్నాయా? రోజువారీగా ఎన్ని టిప్పర్లు మొరం తరలిస్తున్నాయి? రాయల్టీ చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, కొన్ని క్వారీల వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడి కారణంగానే సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు. ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

**అధికారుల మౌనం ఎందుకు?**

మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అనుమతులు, రాయల్టీ చెల్లింపులు, తవ్వకాల పరిమాణం, రవాణా పర్మిట్లను పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు ఉన్నట్లయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని లెక్కించి వసూలు చేయాలని కోరుతున్నారు. అనుమతులు ఉంటే వివరాలు బయటపెట్టాలి.. అక్రమ తవ్వకాలు ఉంటే అడ్డుకోవాలి.. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొరం తవ్వకాలపై పూర్తి వివరాలతో త్వరలో మరింత సంచలన కథనం...



# హైదరాబాద్‌లో ఘనంగా నారాయణ పాఠశాలల ఆస్పైర్ సమ్మిట్ 3.0

**కాజీపేట నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ అనిత, ఉపాధ్యాయ బృందానికి ఘన సత్కారం**

**హైద్రాబాద్, 12 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ప్రముఖ విద్యాసంస్థ నారాయణ గ్రూప్ ఆధ్వర్యంలో ‘ఆస్పైర్ సమ్మిట్ 3.0’ ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల డ్రాపౌట్స్‌ను తగ్గించడంతో పాటు అడ్మిషన్ల పరిరక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కాజీపేటలోని నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ అనితతో పాటు ఉపాధ్యాయ బృందాన్ని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ రమణారాయణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని విద్యా రంగంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం నారాయణ విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమన్నారు. విద్యా రంగంలో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సత్కరించడంతో పాటు విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడమే ఆస్పైర్ సమ్మిట్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జీఎం గోపాలరెడ్డి, వరంగల్ జోనల్ డీజీఎం రిజ్వాన ఇమ్రాన్, కోఆర్డినేటర్లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, శిరీష, అకడమిక్ డీన్లు గణేష్, హాఫీజ్, సుగంధి, వీసీలు అనూష, మౌనిక, ఏఓ గుంపుల చేరాలు తదితరులు పాల్గొన్నారు.



# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!



వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది.ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

# అరటి ఆకులో భోజనం దీని వెనుక అసలు కారణం ఇదే

మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు ప్రతి పండగ, వేడుకలో అరటి ఆకుల్లో భోజనం చేయడం కనిపిస్తుంది. పురాతన కాలం నుంచి అరటి ఆకులను వివిధ ఆచారాలు, వేడుకలు, రోజువారీ ఆహారంలో మనోళ్లు ఉపయోగిస్తున్నారు. మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. ఆకులు కడగడం నుంచి చివరికి తినడం, ఆకులు మడతపెట్టడం వరకు కొన్ని ఆచారాలు ఉన్నాయి. తినడానికి ముందు అరటి ఆకుపై నీళ్లు చల్లడం శతాబ్దాల నాటి ఆచారం. దీనికి వివిధ కారణాలు ఉన్నాయి. అరటి ఆకులు సహజంగా కీటకాలు, సూక్ష్మజీవులను కలిగి ఉంటాయి. నీటితో చల్లడం, శుభ్రపరచడం వల్ల ఆకులపై ఉన్న కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. ఆకులపై దుమ్ము, ధూళిని తొలగించి శుభ్రంగా ఉంచడానికి కూడా ఇలా చేస్తారు. అంతేకాకుండా నీటిని చల్లడం వల్ల ఆకులు గట్టిపడతాయి. ఇలా చేయడం వల్ల తినేటప్పుడు ఆకులు చిరిగిపోవడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా అరటి ఆకుపై నీరు చల్లడం చాలా పవిత్రమైన కార్యమని కూడా నమ్ముతారు. అరటి ఆకులో తిన్న తర్వాత దానిని లోపలికి మడతపెడతారు. అలా చేయడం ఆహారాన్ని తయారు చేసి వడ్డించిన వారికి గౌరవం చూపించే మార్గంగా పరిగణిస్తారు. కొన్నిసార్లు ఆహార అవశేషాలు ఆకు లోపలి భాగంలో ఉంటాయి. అందువల్ల ఆకును బయటి నుండి లోపలికి మడవటం వల్ల అవి జారి పోకుండా ఉంటాయి. అలాగే ఆకును లోపలికి మడతపెట్టడం వల్ల సూర్యరశ్మి దానిలోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. దీనివల్ల అందులోని ఆహారం చెడిపోకుండా ఉంటుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే




శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?



కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

## హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్‌కు నాపై క్రష్.. మెసేజ్‌లు చేస్తుంటాడు: మల్లికా శెరావత్



బాలీవుడ్ నటి మల్లికా శెరావత్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ క్రూజ్‌కు తనపై క్రష్ ఉందని, ఆయన తనకు సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా మెసేజ్‌లు కూడా చేస్తుంటారని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. త్వరలో ప్రారంభం కానున్న 'ది ట్రెయిటర్స్ 2' అనే రియాలిటీ షోలో ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ షోలో తోటి కంటెస్టెంట్ ఆదిత్య కులశ్రేష్ఠ, "మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా? లేక మీపైనే అందరికీ క్రష్ ఉంటుందా?" అని మల్లికాను ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. "నాపైనే అందరికీ క్రష్ ఉంటుంది. ఇటీవల టామ్ క్రూజ్‌కు కూడా నాపై క్రష్ ఏర్పడింది. నేను అబద్ధం చెప్పడం లేదు. నా దగ్గర ఫోన్ ఉండుంటే, మేమిద్దరం కలిసి పార్టీ చేసుకున్న వీడియోలను మీకు చూపించేదాన్ని" అని బదులిచ్చారు. టామ్ క్రూజ్ అద్భుతమైన వ్యక్తి అని ఆమె కితాబిచ్చారు.అయితే, ఇవి కేవలం మల్లికా శెరావత్ చేసిన వ్యాఖ్యలు మాత్రమేనని, దీనిపై టామ్ క్రూజ్ లేదా అతని ప్రతినిధుల నుంచి ఎలాంటి అధికారిక స్పందన గానీ, ధ్రువీకరణ గానీ రాలేదని సమాచారం.

ఆగస్టు 13 నుంచి 'ది ట్రెయిటర్స్ 2'

ప్రముఖ రియాలిటీ షో 'ది ట్రెయిటర్స్' మొదటి సీజన్ విజయవంతం కావడంతో, ఇప్పుడు రెండవ సీజన్ రాబోతోంది. కరణ్ జోహార్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ షో ఈ నెల 13 నుంచి ప్రైమ్ వీడియోలో ప్రత్యేకంగా ప్రసారం కానుంది. ఇది ఒక స్ట్రాటజీ ఆధారిత గేమ్ షో. ఇందులో కంటెస్టెంట్లను రహస్యంగా 'ఫెయిత్‌ఫుల్స్', 'ట్రెయిటర్స్'గా విభజిస్తారు. మోసం, వ్యూహాలు, పొత్తుల ద్వారా చివరికి విజేతను నిర్ణయిస్తారు.ఈ సీజన్‌లో మల్లికా శెరావత్‌తో పాటు మునవర్ ఫరూఖీ, శ్వేతా తివారీ, రియా చక్రవర్తి, క్రిస్టల్ డిసౌజా, దలీప్ తాహిల్, అభిషేక్ మల్హాన్ వంటి పలు రంగాలకు చెందిన ప్రముఖులు కంటెస్టెంట్లుగా పాల్గొంటున్నారు. మొత్తం మీద షో ప్రసారం కాకముందే మల్లికా వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా దీనిపై ఆసక్తి నెలకొంది.

## కూతురి కోసం దీక్ష, ఊరి కోసం పోరాటం..

## ఆసక్తి రేపుతున్న రవితేజ 'ఇరుముడి' ట్రైలర్

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఎన్నో అంచనాల నడుమ ఈ సినిమా అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం బుధవారం నాడు ప్రత్యేకమైన ఈవెంట్ లో విడుదల చేసింది. భక్తి, యాక్షన్, తండ్రీకూతుళ్ల సెంటిమెంట్ అంశాల కలబోతగా కట్ చేసిన ఈ ట్రైలర్, సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.ట్రైలర్ ప్రకారం, ఈ సినిమాలో రవితేజ 'త్రినాథ్' అనే తండ్రి పాత్రలో కనిపించనున్నారు. మద్యపానానికి బానిసైనప్పటికీ, తన కూతురి (బేబీ నక్షత్ర) బాగు కోసం ప్రతి ఏటా 41 రోజుల పాటు కఠినమైన అయ్యప్ప దీక్షను చేపడతాడు. ఆ సమయంలో సంపూర్ణంగా మద్యపానానికి దూరంగా ఉంటూ ఎంతో నిష్ఠగా ఉంటాడు. అయితే అదే సమయంలో వారి ఊరిలో వరుసగా పాఠశాల విద్యార్థినులు అనుకోని పరిస్థితుల్లో మరణిస్తుంటారు.ఈ హత్యల వెనుక ఉన్న నిజాన్ని ఛేదించే క్రమంలో త్రినాథ్ చిక్కుకుంటాడు. అయితే, దీక్ష నియమాల ప్రకారం ఎవరితోనూ గొడవ పడకూడదు, హింసకు పాల్పడకూడదు. సరిగ్గా ఇదే అదనుగా భావించిన ప్రతినాయకులు అతనిపై దాడులకు తెగబడతారు. దీక్షలో ఉన్న సమయంలో తన కూతురిని, ఊరి ప్రజలను ఎలా కాపాడుకున్నాడు? అనేదే ఈ చిత్ర కథాంశంగా తెలుస్తోంది. తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు, అయ్యప్ప భక్తి నేపథ్యం, ఉత్కంఠ రేపే మిస్టరీ, యాక్షన్ అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.రవితేజకు జంటగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, సీనియర్ నటుడు సాయి కుమార్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'మజిలీ', 'నిన్ను కోరి' వంటి విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన "ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు.." పాట మంచి స్పందన రాబట్టుకోగా, ఇప్పుడు ట్రైలర్ కూడా సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పింది. రొటీన్ కమర్షియల్ చిత్రాలకు భిన్నంగా, రవితేజ నుంచి ఒక కొత్త తరహా సినిమా రాబోతోందని ప్రేక్షకులు భావిస్తున్నారు.






## త్రిషను డిప్యూటీ సీఎం ఎప్పుడు చేస్తారు?.. సీఎం విజయ్‌పై ఏఐఏడీఎంకే నేత సెటైర్

తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్, ప్రముఖ నటి త్రిష కృష్ణన్‌ను ముడిపెడుతూ మరో రాజకీయ వివాదం చెలరేగింది. విజయ్‌తో అనేక చిత్రాలలో నటించిన త్రిషను ఎప్పుడు ఉప ముఖ్యమంత్రిని చేస్తారంటూ ఏఐఏడీఎంకే నేత, మాజీ మంత్రి ఆర్.బి.ఉదయకుమార్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి.ఉదయకుమార్ మాట్లాడిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అందులో ఆయన, టీవీకే ప్రభుత్వం.. ముఖ్యమంత్రితో సన్నిహితంగా ఉన్నవారికే ప్రభుత్వ పదవులు కట్టబెడుతోందని ఆరోపించారు. ముఖ్యంగా, విజయ్ సినిమాలకు పనిచేసిన నిర్మాతలు, సాంకేతిక సిబ్బందిని ప్రభుత్వంలోని కీలక స్థానాల్లో నియమిస్తున్నారని విమర్శించారు. ఆలయ ట్రస్టీ, న్యూఢిల్లీలో తమిళనాడు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, సీఎం వ్యక్తిగత కార్యదర్శి, రాష్ట్ర ఫిల్మ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హెడ్, ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన వారిని ఉదహరించారు. ఈ క్రమంలోనే, త్రిషను ఎప్పుడు డిప్యూటీ సీఎం చేస్తారంటూ ఆయన ఎద్దేవా చేశారు. నటి త్రిషను ఉద్దేశించి ద్వంద్వార్థాలతో వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై డీఎంకే నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్ట్ చేసి, విచారణ అనంతరం విడుదల చేసిన కొన్ని రోజులకే ఈ కొత్త వివాదం తలెత్తడం గమనార్హం. అయితే, తాను రాష్ట్రానికి కావేరి జలాల గురించి మాత్రమే మాట్లాడానని, తన వ్యాఖ్యలకు ఒకే అర్థం ఉందని అప్పట్లో ఉదయనిధి స్పష్టం చేశారు. ఇప్పుడు ఉదయకుమార్ వ్యాఖ్యలతో త్రిష పేరు మరోసారి తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## సర్జరీ అనంతరం.. సోషల్ మీడియా వేదికగా స్పందించిన జూ ఎన్టీఆర్

తనకు జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం తాను క్షేమంగా ఉన్నానని టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తన ఆరోగ్యం కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయిలో కోలుకుని అందరినీ కలుస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ మేరకు జూనియర్ ఎన్టీఆర్ ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "మీ ప్రేమ, ప్రార్థనలు వెల్లువెత్తాయి. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది, నేను ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాను. నాకు చికిత్స అందించిన కిమ్స్ ఆసుపత్రిలోని అద్భుతమైన వైద్య బృందానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు. అంతేకాకుండా, తనకు నిరంతరం అండగా నిలుస్తున్న మిత్రులు, కుటుంబ సభ్యులు, అభిమానులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. "మీ మద్దతే నాకు ప్రతిరోజూ బలాన్ని ఇస్తుంది. త్వరలోనే మిమ్మల్ని కలుస్తాను" అని తన సందేశంలో పేర్కొన్నారు.

